క్లుప్తంగా

మైనార్టీలు ఇప్పుడు గుర్తొచ్చారా?

భద్రాచలంఅర్బన్: బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గుర్తుకు రాని ముస్లిం మైనార్టీలు ఇప్పుడు గుర్తుకు వస్తున్నారా? అని కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహమ్మద్ ఖాన్ ప్రశ్నించారు. భద్రాచలంలోని పార్టీ కార్యాలయంలో జరిగి సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం ఎన్నికల దగ్గర పడుతున్నాయనే ఉద్దేశంతో కొత్తగూడెంలో ఉన్న ఉర్దూగర్‌లో ముస్లిం మైనార్టీలకు చెక్కులు పంపిణీ చేశారని, అదికూడా 10వేల మందికి పైగా ముస్లింలు దరఖాస్తు చేసుకుంటే కేవలం 140మందికి మాత్రమే చెక్కులు అందించడం విచారకరం అన్నారు. భద్రాచలం పట్టణ మైనార్టీ అధ్యక్షుడు మొహమ్మద్ ఆరిఫ్, పట్టణ మైనార్టీ ప్రధాన కార్యదర్శి బాబాజీ, ఎస్టీ సెల్ జిల్లా నాయకులు ఉబ్బా వేణు, జిల్లా కార్యదర్శి వెంకట్ నారాయణ పాల్గొన్నారు.

మానవత్వ గుణం అలవర్చుకోవాలి



విద్యార్థుల మానవత్వ ప్రదర్శనలో సీఐ బాలాజీ వరప్రసాద్

మణుగూరురూరల్: ప్రతీ ఒక్కరు మానవత్వ గుణాన్ని అలవర్చుకోవాలని మణుగూరు సీఐ బాలాజీ వరప్రసాద్ అన్నారు. ఎక్స్‌లెంట్ స్టార్ పాఠశాల ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ మానవత్వ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐ బాలాజీ వరప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుండే పిల్లలు మానవత్వ గుణాన్ని అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎక్స్‌లెంట్ విద్యాసంస్థల చైర్మన్ యూసఫ్ షరీఫ్, డైరెక్టర్లు ఖాదర్, యాకుబ్ షరీఫ్, ప్రిన్సిపల్ సమీన నయ్యర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోటారు ఏర్పాటు

అశ్వారావుపేటరూరల్: తాగునీటి బోరుకు ఎట్టకేలకు మోటారును ఏర్పాటు చేశారు. మండలంలోని గుమ్మడవల్లి గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు బోరు నిర్మించి, మోటారును ఏర్పాటు చేయకుండా వదిలేసిన సంగతి తెలిసిందే. దాంతో ఈ నెల 15వ తేదీన బోరు వద్ద గ్రామస్తులు నిరసన వ్యక్తం వ్యక్తం చేయగా, దీనిపై 'సాక్షి' దినపత్రికలో 'నిధులిచ్చినా నీరందలే' అనే శీర్షిక కథనం ప్రచురితమైంది. ఎట్టకేలకు అధికారులు పనులు చేసిన కాంట్రాక్టరుతో బోరుకు విద్యుత్ మోటారును శనివారం ఏర్పాటు చేయించారు.

దివ్యాంగుల వినతి

భద్రాచలంటౌన్: భద్రాచలం డివిజన్‌లోని దివ్యాంగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ భద్రాద్రి ఫిజికల్ హ్యాండీక్యాప్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం భద్రాచలం ఆర్డీఓ మంగీలాల్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు ఊటూరి సాయిరాం మాట్లాడుతూ.. పలు డిమాండ్లను ఆయన ముందుంచారు. సెక్రటరీ అన్నం సత్తిబాబు, రామ రుద్రయ్య, కొండరెడ్డి, చైతన్య, ఆనంద్ పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ మహాసభ

గుండాల: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కె.షాహెద్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఏఐఎస్ఎఫ్ మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహాసభలో మండల కార్యదర్శిగా గంగాధరి వినయ్, అధ్యక్షుడిగా పవన్ కల్యాణ్, సహాయ కార్యదర్శిగా గడ్డం వరుణ్, ఉపాధ్యక్షుడిగా ఎస్‌కె.నాసీర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని తెలిపారు. నాయకులు గడ్డం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

దుమ్ముగూడెం: స్వాతంత్ర్య దినోత్సవం రోజు రాత్రి హైదరాబాద్ ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక గిరిజన మహిళను చిత్రహింసలకు గురిచేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఐటీడీఏ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆదివాసీ కాంగ్రెస్ నాయకులు ఉబ్బా వేణు, కె.విజయ్ కుమార్, కోడి చంటి, జి.సతీష్, గుమ్మడి శ్రీనివాస్, సాగర్, వెంకటేష్, భాస్కర రావు, రవి, కె.వేణుబాబు, కె.ఏసుబాబు, గోపి, కె.వీర్రాజు, జానకి, వీరమ్మ, దుర్గ భవాని, కనకమ్మ పాల్గొన్నారు.

ఎంపీఓకు సన్మానం

దుమ్ముగూడెం: మండల పంచాయతీ అధికారి ముత్యాలరావును మండల సర్పంచ్‌లు శనివారం ఘనంగా సన్మానించారు. ఉత్తమ ఎంపీఓ అవార్డు అందుకున్నందుకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. సర్పంచ్‌లు సోడి జ్యోతి, మిడియం జయ, తెల్లం వరలక్ష్మి, కారం జయ, నూప సుమిత్ర, వర్షా చిన్నారావు, జలకం సీతారామయ్య, మడకం నాగేంద్ర బాబు, నాయకులు జయసింహ, సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

- అవగాహన ర్యాలీలో అధికారులు
- విజయవంతమైన 5కే రన్
- ఉద్యోగులు, ప్రజల నుంచి స్పందన



భద్రాచలంఅర్బన్: ఓటరు అవగాహన ర్యాలీలో అధికారులు..



అశ్వారావుపేటరూరల్: 5కే రన్‌లో పాల్గొన్న అధికారులు, ఉద్యోగులు, అంగన్‌వాడీలు

భద్రాచలంఅర్బన్: ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలని భద్రాచలం ఏఎస్పీ పారితోజ్ పంకజ్ అన్నారు. నూతన ఓటర్ల నమోదు, ఓటు హక్కు వినియోగం, ఓటు ప్రాధాన్యతపై శనివారం 5కే రన్ నిర్వహించారు. సీఆర్పీఎఫ్ సెకండ్ 141 బెటాలియన్ కమాండెంట్ కమల వీరు యాదవ్, సెకండ్ కమాండెంట్ సింగర్ విల్ గిఫ్ట్, భద్రాచలం ఆర్డీఓ మంగీలాలతో కలిసి భద్రాచలంలోని బ్రిడ్జి సెంటర్ నుంచి కూనవరం రోడ్డులోని సీఆర్పీఎఫ్ క్యాంప్ వరకు నిర్వహించిన 5 కే రన్‌ను ఏఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు కీలకమని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని సూచించారు. పోలింగ్ ప్రక్రియపై అవగాహనకు మాక్ పోలింగ్‌లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ 5కే రన్ విజయవంతంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘవీర్ దీప్తి కమాండెంట్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, భద్రాచలం స్పెషల్ ఆఫీసర్ నాగలక్ష్మి, తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్, దుమ్ముగూడెం తహసీల్దార్ మణిధర్, మారుతి నర్సింగ్ కళాశాల, డిగ్రీ కాలేజ్, జూనియర్ కాలేజ్ విద్యార్థులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల ఆదేశాల మేరకు ఓటర్ నమోదుపై చైతన్యం కలిగిస్తూ మణుగూరు రెవిన్యూ శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 5కె రన్ విజయవంతమైంది. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా హాజరైన మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావు జెండా ఊపి ప్రారంభించారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ రమాదేవి, డీఎస్పీ రాఘవేంద్రరావు మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు ఓటర్ నమోదు చేయించుకోవాలని సూచించారు. ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకుని సరైన అభ్యర్థిని ఎన్నుకోవాలన్నారు. కార్యక్రమంలో మణుగూరు మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు, అశ్వాపురం ఎస్సై రవీందర్, రెవెన్యూ, పోలీస్, మున్సిపల్ శాఖల అధికారులు, సిబ్బంది, యువతీ,యువకులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని పాల్వంచ డీఎస్పీ వెంకటేష్ అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేటలో శనివారం ఓటు హక్కు ప్రాధాన్యత, కొత్త ఓటర్ల నమోదుపై అవగాహన కల్పించేందుకు 5కే రన్ నిర్వహించారు. స్థానిక రింగ్ రోడ్ సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ మీదుగా గాంధీ బొమ్మ సెంటర్ వరకు ఈ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, ఉద్యోగులు, అంగన్‌వాడీ టీచర్లు, బీఆర్ఎస్ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేస్తున్నా.. ఆశీర్వదించండి


ములకలపల్లి: సెంట్రల్ లైటింగ్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మెచ్చా..

దమ్మపేట: నియోజకవర్గ పరిధిలో చేస్తున్న అభివృద్ధిని చూసి తనను ఆశీర్వదించాలని స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు కోరారు. శనివారం మండల పరిధిలో సుడిగాలి పర్యటన చేసిన ఎమ్మెల్యే పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండల కేంద్రంలో రూ.5 కోట్ల వ్యయంతో మంజూరైన సెంట్రల్ లైటింగ్ పనులకు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. అడగ్గానే నిధులను మంజూరు చేసిన సీఎం కేసీఆర్ చిత్రపటానికి ఎమ్మెల్యే పాలభిషేకం చేశారు. ప్రతి గ్రామంలోను అనేక సీసీ రోడ్లను మంజూరు చేయించానని, రాబోయే రెండు నెలల్లో గ్రామాల్లో అవసరమైన ప్రతిచోట సీసీ రోడ్లను మంజూరు చేయించి, పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. అంతకు ముందుగా ఎమ్మెల్యే స్వగ్రామం తాటిసుబ్బన్నగూడెంలో 22 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం పట్వారిగూడెం గ్రామంలో నిర్వహించిన ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ సోయం ప్రసాద్, వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు, బీఆర్ఎస్ నాయకులు దారా యుగంధర్, దొడ్డాకుల రాజేశ్వరరావు, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, యార్లగడ్డ బాబు, అబ్దుల్‌జిన్నా తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి: బీఆర్ఎస్ పాలనలో ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. ములకలపల్లి మండలకేంద్రంలో రూ 5.75 కోట్ల వ్యయంతో నిర్మించనున్న సెంట్రల్ లైటింగ్‌కు శనివారం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. స్థానికులు ఎమ్మెల్యేను దుశ్శాలువతో సత్కరించారు. అనంతరం స్థానిక పాత పోలీస్‌స్టేషన్ సమీపంలో నిర్మించిన హమాలీ కార్మికుల కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎంపీపీ మట్ల నాగమణి, ములకలపల్లి, దమ్మపేట జెడ్పీటీసీలు సున్నం నాగమణి, పైడి వెంకటేశ్వరరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు, తహసీల్దార్ పుల్లారావు, ఎంపీడీఓ శ్రీను, ఆర్‌అండ్‌బీ డీఈ శ్రీనివాసరావు, ఎంపీటీసీ మోహరమణి, సర్పంచ్‌లు, బీఆర్ఎస్, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం


శంకుస్థాపన చేస్తున్న విప్ రేగా కాంతారావు

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధే సీఎం కేసీఆర్ ధ్యేయమని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. మండల పరిధిలోని కూనవరం గ్రామపంచాయతీలో రూ.50 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టనున్న అల్లూరి సీతారామరాజు కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులకు ప్రభుత్వ విప్ రేగా కాంతారావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని సామాజిక వర్గాలన్నింటికి సీఎం కేసీఆర్ సమప్రాధాన్యత కల్పిస్తున్నారన్నారు. కులసంఘాలకు ఆత్మగౌరవ భవనాలను కేటాయిస్తూ.. నిధులు మంజూరు చేస్తూ సీఎం కేసీఆర్ ఆదర్శపాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మణుగూరు ఎంపీపీ కారం విజయకుమారి, జెడ్పీటీసీలు పోశం నర్సింహారావు, దాట్ల సుభద్రాదేవి, సర్పంచ్ ఏనిక ప్రసాద్, ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు ముత్యం బాబు, అడపా అప్పారావు, నవీన్, యాదగిరిగౌడ్, రమణ, కృష్ణ, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

కులవృత్తుల బాంధవుడు కేసీఆర్..

రాష్ట్రంలోని బీసీ కులవృత్తుల బాంధవుడు సీఎం కేసీఆర్ అని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. శనివారం ఆయన క్యాంప్ కార్యాలయంలోని తన చాంబర్‌లో మాట్లాడుతూ.. పినపాక నియోజకవర్గంలో 300 మంది బీసీ కులవృత్తుల వారికి పూర్తి స్థాయి సబ్సిడీపై లక్ష రూపాయలను మంజూరు చేసినట్లు, ఈ నెల 21వ తేదీన లబ్ధిదారులకు సంబంధిత చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

సన్మానం..

ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావును మణుగూరు ఆర్టీసీ డిపో డీఎం టి.స్వామి ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులు శనివారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్టీసీ సంస్థను రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ.. రేగా కాంతారావును శాలువాలతో ఘనంగా సన్మానించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాల్లో వెలుగులు నింపిన సీఎం కేసీఆర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

భూములను రక్షించండి

ములకలపల్లి: ములకలపల్లి మండలకేంద్రంలో అక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ములకలపల్లికి చెందిన నూపా భాస్కర్ తహసీల్దార్ పుల్లారావుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ములకలపల్లిలో ప్రభుత్వ చెరువులు, కుంటలు, భూములను అక్రమార్కులు ఇష్టారాజ్యంగా ఆక్రమణకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సమగ్ర విచారణ జరిపించి వాటిని స్వాధీనం చేసుకుని, ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని ఆయన కోరారు.

వైద్య శిబిరం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుంటిమడుగు గిరిజన గ్రామంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో వినాయకపురం పీహెచ్‌సీ వైద్యాధికారి రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో 31 మందికి ఆరోగ్య పరీక్షలు చేసి, వారిలో ఇద్దరు జ్వర పీడితులను గుర్తించారు. జ్వరాలతో బాధ పడుతున్న వారికి మలేరియా పరీక్షలు చేయగా నిర్ధారణ కాలేదని వైద్యాధికారి తెలిపారు. అనంతరం పరిసరాల పరిశుభ్రత గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి అజ్మీర వెంకటేశ్వరరావు, హెచ్‌ఈఓ రాజు, శ్రీను, రవి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్డీఓను కలిసిన డీలర్లు

అశ్వాపురం: ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన భద్రాచలం ఆర్డీఓ మంగీలాల్‌ను భద్రాచలంలో శనివారం రేషన్ డీలర్లు, వారి సంఘం జిల్లా అధ్యక్షుడు కొడాలి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆర్డీఓను శాలువాతో సన్మానించారు.

నిత్యావసరాల పంపిణీ

గుండాల: ఇటీవల కురిసి భారీ వర్షాలకు నష్టపోయిన బాధితులకు క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ముత్తాపురం గ్రామంలో 50 కుటుంబాలకు, సాయనపల్లిలో 36 కుటుంబాలకు, నర్సాపురంలో 16 మంది కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. ప్రభుత్వం వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గోవింద నర్సింహారావు, జాన్, సనప రాజు, అనోహు, మస్తాన్, అమోన్ తదితరులు పాల్గొన్నారు.

జన్మదిన వేడుకలు

అశ్వాపురం: మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం బీఆర్ఎస్ పినపాక నియోజకవర్గ యూత్ కోఆర్డినేటర్ నవీన్ బాబు జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ పార్టీ మండల యువజన అధ్యక్షుడు గద్దల రామకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మొండికుంట, మల్లెలమడుగు, తుమ్మలచెరువుతో పాటు పలు గ్రామాల్లో నవీన్‌బాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ పార్టీ యూత్, యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విధుల నుంచి తొలగించాలి

చర్ల: మండలంలోని కుర్నపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఎర్రబోరులో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు వీరన్న పాఠశాలకు సక్రమంగా హాజరుకాకపోవడం వల్ల విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని తక్షణమే ఆయనను విధుల నుంచి శాశ్వతంగా తొలగించాలని సీపీఎం చర్ల మండల కార్యదర్శి కారం నరేష్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఎర్రబోరు పాఠశాలను సందర్శించి అక్కడి విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడారు. తక్షణమే ఇతన్ని తొలగించి అక్కడ మరో ఉపాధ్యాయుడిని నియమించాలని డిమాండ్ చేశారు.

ర్యాగింగ్‌తో అనర్థాలు


మాట్లాడుతున్న సీఐ కరుణాకర్

అశ్వారావుపేటరూరల్: ర్యాగింగ్ భూతంలాటిదని, ఇదీ అనేక అనర్థాలకు దారి తీస్తుందని అశ్వారావుపేట సీఐ కరుణాకర్ అన్నారు. స్థానిక వ్యవసాయ కళాశాలలో శనివారం ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాలల్లో సీనియర్లు, జూనియర్లను ర్యాగింగ్ పేరుతో ఇబ్బందులు పెట్టి, తాము ఇబ్బందులు పడొద్దన్నారు. ఎవరైన ఇలాంటి చర్యలకు పాల్పడితే బాధితులు నేరుగా డయల్ 100కు సమాచారం ఇవ్వొచ్చని తెలిపారు. అనంతరం హెల్మెట్, రోడ్డు ప్రమాదాల గురించి కూడా అవగాహన కల్పించారు. సమావేశంలో కళాశాల ఇన్‌చార్జ్ అసోసియేట్ డీన్ డాక్టర్ వెంకన్న, శాస్త్రవేత్తలు కె.గోపాలకృష్ణమూర్తి, ఐవీ శ్రీనివాసరెడ్డి, మధుసూధన్‌రెడ్డి, నాగాంజలి, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజకీయ వృద్ధి కోసమే పార్టీ మార్పు



మాట్లాడుతున్న టీపీసీసీ సభ్యుడు బుడగం శ్రీనివాస్

భద్రాచలంఅర్బన్: పదేళ్లుగా మాయ మాటలతో భద్రాచలం ప్రజలను ముఖ్యమంత్రి కేసీఆర్ మోసం చేశారని టీపీసీసీ సభ్యుడు బుడగం శ్రీనివాస్ ఆరోపించారు. మరోపక్క తన రాజకీయ అభివృద్ధి కోసమే తెల్లం వెంకట్రావు పార్టీలు మారుతున్నారని విమర్శించారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సరెళ్ల నరేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో బుడగం శ్రీనివాస్ మాట్లాడుతూ.. పక్కన ఉన్న పినపాక నియోజకవర్గ అభివృద్ధికి 100 కోట్ల నిధులు విడుదల చేశారు గానీ, భద్రాచలం రాముడికి, భద్రచలం ప్రజానీకానికి ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా వివక్షత చూపారని విమర్శించారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతిరెల రవికుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బోగాల శ్రీనివాసరెడ్డి, బలుసు నాగ సతీష్, సరెళ్ల వెంకటేష్, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రహదారి పనులెప్పుడు?


అస్తవ్యస్తంగా తుమ్మల చెరువు రహదారి

అశ్వాపురం: మండల పరిధిలోని తుమ్మలచెరువు నుంచి గొందిగూడెం మీదుగా అశ్వాపురం వరకు రహదారి గుంతలమయమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారి అధ్వానంగా ఉండి సుమారు 20 గ్రామాల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. భారీ వర్షాలకు రహదారిపై అడుగు తీసి అడుగు వేయలేని దుస్థితి నెలకొన్నది. పాఠశాలలకు వెళ్లే పిల్లలు, వృద్ధులు, మహిళలు, రైతులు అవస్థలు పడుతున్నారు. రహదారి నిర్మాణానికి రూ.5 కోట్లు నిధులు మంజూరై నెలలు గడుస్తున్నా టెండర్లు, అగ్రిమెంట్ ప్రక్రియ పూర్తయినా కాంట్రాక్టర్ రహదారి పనులు చేపట్టడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కాలేజీలో క్లీన్ అండ్ గ్రీన్

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సర్పంచ్ మడి రాజేష్ ఆధ్వర్యంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం శనివారం చేపట్టారు. దుమ్ముగూడెంలో ఇటీవల వర్షాల కారణంగా పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు, గడ్డిని పంచాయతీ సిబ్బంది తొలగించారు. కళాశాల ప్రాంగణంలో తరగతి గదుల పక్కన బాలికల మరుగుదొడ్ల వద్ద పెరిగిన గడ్డి, పిచ్చి మొక్కలను తొలగించి కలుపు మందు కొట్టారు. కాలేజీ ఆవరణను శుభ్రపరిచినందుకు పంచాయతీ పాలక సిబ్బందికి, పంచాయతీ కార్యదర్శికి కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ వై.మల్లికార్జునరావు, సిబ్బంది ధన్యవాదాలు తెలిపారు.

నేడు విప్ పర్యటన

కరకగూడెం: నేడు పినపాక, కరకగూడెం మండలాల్లో ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నట్లు ఆ మండలాల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పగడాల సతీష్ రెడ్డి, రావుల సోమయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

తల్లిదండ్రులు క్రమశిక్షణతో పెంచాలి


భద్రాచలంటౌన్: విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న సీఐ నాగరాజు రెడ్డి


భద్రాచలంటౌన్: తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు పంపే ముందు క్రమశిక్షణతో పాటు నైతిక విలువలను నేర్పించాలని భద్రాచలం సీఐ నాగరాజు రెడ్డి అన్నారు. పట్టణంలోని జగదీష్ కాలనీలో శనివారం జరిగిన తల్లిదండ్రుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తోందని, తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని సూచించారు. అనంతరం ఐటీసీ భద్రాచలం వారు సహకారంతో అందించిన నోట్ పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జ్యోతికుమార్, రామకృష్ణ, రమేష్, శ్రీను, విజయ్‌కుమార్, లక్ష్మి, ఆశాలత, మనీషా, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అశ్వాపురం: విద్యార్థులను మొబైల్‌ఫోన్లకు, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంచాలని జిల్లా విద్యా కమ్యూనిటీ మొబిలైజింగ్ ఆఫీసర్ ఎస్‌కే.సైదులు తల్లిదండ్రులకు సూచించారు. మండల పరిధిలోని అశ్వాపురం, నెల్లిపాక బంజర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శనివారం నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో ప్రతి 3వ శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహిస్తారని సమావేశానికి తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. పిల్లలకు నీతి కథలు, పఠనంపై ఆసక్తి కలిగించాలన్నారు. కార్యక్రమాల్లో అశ్వాపురం జెడ్పీ స్కూల్ హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ పితామహుడు డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ర్యాలీలు తీశారు. పలువురికి ఆర్థిక సాయం, వితరణలు అందించారు. సీనియర్ ఫొటోగ్రాఫర్లను సన్మానించి జ్ఞాపికలను అందించారు. పలువురు రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు పాల్గొని ఫొటోగ్రాఫర్లకు శుభాకాంక్షలు తెలిపారు.

– సాక్షి నెట్‌వర్క్


అశ్వారావుపేటరూరల్: సీనియర్ ఫొటోగ్రాఫర్‌ను సన్మానిస్తున్న సహచరులు


కరకగూడెం: లూయిస్ డాగురే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అసోసియేషన్ సభ్యులు


బూర్గంపాడు: ఆర్థికసాయం అందిస్తున్న ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ ప్రతినిధులు

రెండో ఏఎన్ఎంల నిరసన


అశ్వారావుపేట: సమ్మెకు మద్దతు తెలిపిన సీపీఐ నాయకులు

భద్రాచలంఅర్బన్: గత నాలుగు రోజులుగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 4500 మంది రెండో ఏఎన్ఎంలు తమ సమస్యలను పరిష్కరించాలని సమ్మె చేస్తున్నా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో చలనం లేదని సీపీఐ పట్టణ కార్యదర్శి ఆరోజు సునీల్ కుమార్ అన్నారు. శనివారం భద్రాచలంలో రెండో ఏఎన్ఎంల సమ్మె శిబిరాన్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు బల్ల సాయికుమార్, మారెడ్డి శివాజీ, లంకపల్లి విశ్వనాథ్, బత్తుల నరసింహులు, సీవీపీఎస్ నాయుడు, జక్కం గోపి, చాడా శోభన్ బాబు, అయినాల రామకృష్ణ పాల్గొన్నారు.

మణుగూరురూరల్: సెకండ్ ఏఎన్ఎంలను ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు ఆర్.లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలంటూ సెకండ్ ఏఎన్ఎంలు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె శనివారం నాలుగో రోజుకు చేరింది. నాలుగో రోజు సమ్మె శిబిరాన్ని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు సందర్శించి సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడారు. సీపీఐ మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి, ఏఐటీయూసీ జిల్లా నాయకులు వేల్పుల మల్లికార్జున్, నాయకులు, సెకండ్ ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

అశ్వారావుపేట: తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని కోరుతూ శనివారం సెకండ్ ఏఎన్ఎంలు శనివారం సమ్మె బాట పట్టారు. స్థానిక రింగ్ రోడ్ సెంటర్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సెకండ్ ఏఎన్ఎంలు సమ్మె నిర్వహించగా, వారికి సీపీఐ నాయకులు సయ్యద్ సలీం, గన్నిన రామకృష్ణ, ఎస్‌డీ రఫీ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ..సెకండ్ ఏఎన్ఎంల డిమాండ్‌లను తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు.